# సమన్వయ లోపమే సిసలైన శాపం

జయప్రకాష్ నారాయణ్

Bhavishyat Bharatam 19-June-2006

ప్రజలకు అందించాల్సిన సేవల విషయంలో ప్రభుత్వం తరచూ చేతులెత్తేస్తోంది.

వివిధ శాఖల మధ్య మెరుగైన సమన్వయం ద్వారానే విధాన రచనలోను, కార్యాచరణలోను మెరుగైన ఫలితాలను సాధించవచ్చు.

భారత వాణిజ్య స్థితిగతులను విశ్లేషిస్తూ ఎకానమిస్ట్ పత్రిక తాజాగా ప్రచురించిన ప్రత్యేక నివేదికలో "ఇండియా ఎప్పటికైనా అంబరాన్ని చుంబించగలదా? " అంటూ ఓ రెచ్చగొట్టే ప్రశ్న వేశారు. ఇందుకు సమాధానం ఒక్కటే... భారత్ ప్రగతి పథంలోనే సాగుతోంది. సరైన దృక్పథం లేని విధానాలు, పాలనపరమైన వైఫల్యాలు వంటి అడ్డంకులు తొలగితే ఈ దేశ ప్రజలు మరెంతో అభివృద్ధిని సాధ్యం చేసి చూపగలరు. దేశాభివృద్ధికి మేలుబాటలు పరవాల్సిన ప్రభుత్వ విధానాలు కాస్తా- రాజకీయం, ప్రజాకర్షక వ్యూహాల రొంపిలో కొట్టుమిట్టాడుతున్నాయి. ప్రభుత్వ విధానాలు తప్పుల తడకగా ఉన్నా- ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, కార్మికులు మాత్రం ఉత్పత్తి, ఉత్పాదకతలను పెంచేందుకు తమవంతు ప్రయత్నం చేస్తూనే ఉన్నారు. మౌలిక సౌకర్యాలు, విద్య, ఆరోగ్యం అన్నవి విధానకర్తలు గట్టిగా దృష్టి సారించాల్సిన సమస్యాత్మక రంగాలు.

*పొంతనలేని విధానాలు*

విద్యుత్ రంగాన్ని పట్టి పీడిస్తున్న ప్రధాన సమస్యలు అందరికీ తెలిసినవే. చిత్తశుద్ధిలేని కేంద్రం చర్యలు, జనాకర్షక విధానాలు, అసమర్థ పరిపాలన, అవినీతి వంటివి దేశ ఆర్థిక ప్రగతిని దిగలాగుతున్నాయి. మనసు పెడితే ఈ సమస్యలను అధిగమించే మార్గాలు సులభంగానే బోధపడతాయి. గుజరాత్‌నే ఇందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు. మూడేళ్ల క్రితం ఆ రాష్ట్ర విద్యుత్ రంగం 2,500 కోట్ల రూపాయల నష్టాల్లో ఉంది. ఆ దశలో గుజరాత్ సర్కారు తీసుకున్న ఓ సాహసోపేత నిర్ణయం విద్యుత్ రంగాన్ని కష్టాలనుంచి గట్టెక్కించింది. గృహ సరఫరా విద్యుత్‌నుంచి వ్యవసాయానికి ఉద్దేశించిన విద్యుత్ లైన్లను ప్రభుత్వం వేరుపరచింది. అక్కడి సర్కారు ఒక హెచ్.పి. వ్యవసాయ విద్యుత్తు సరఫరాకుగాను 850 రూపాయలను వసూలు చేసింది. ఇప్పుడు గుజరాత్ గ్రామాల్లోని గృహాలన్నింటికీ విద్యుత్ సరఫరా జరుగుతోంది. మరోవైపు ఆ రాష్ట్ర విద్యుత్ బోర్డు కూడా లాభాల బాటలో సాగుతోంది. ఏకరూపత లేకుండా రూపొందిన విధానాలు, పొంతనలేని ఆచరణ పట్ల సాక్షాత్తు కేంద్ర ప్రభుత్వమే అసంతృప్తితో ఉంది. ఇంధన రంగాన్నే ఉదాహరణగా ఉదాహరణగా తీసుకుందాం. చమురు-సహజ వాయువు; విద్యుత్, బొగ్గు, గనులు, సాంప్రదాయేతర ఇంధనం, అణు ఇంధనం వంటి పలురకాల మంత్రిత్వ శాఖలు ఉన్నాయి. వీటికితోడు వివిధానేక ప్రభుత్వ సంస్థలూ ఇంధన రంగంలో ఉన్నాయి. ఈ విభాగాలన్నీ దేనికదేగా పనిచేస్తూ సమన్వయం లేకుండా సాగుతున్నాయి. ప్రతి శాఖ ఒకదానితో మరొకటి పొంతన లేకుండా విధులు నిర్వర్తిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఇంధనరంగంలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్న పరిస్థితుల్లో- పకడ్బందీ వ్యూహాలు, చొరవ, సమన్వయాలతో ముందుకు సాగాల్సిన తరుణంలో మన ప్రభుత్వాలు మాత్రం అందుకు భిన్నమైన తీరులో కదులుతున్నాయి.

ప్రభుత్వ విధానాల్లో కొరవడుతున్న సమన్వయానికి ఆరోగ్య రంగాన్ని ఇంకో ఉదాహరణగా చెప్పవచ్చు. పౌష్టి కాహారం, నీటి సరఫరా, పారిశుద్ధ్యం... ఆరోగ్యాన్ని ప్రభావితం చేసే కీలక రంగాలివి. కానీ ఈ మూడింటినీ ఒకదానితో ఒకటి సంబంధం లేని రీతిలో నడుపుతున్నారు. 'నాకో', ఆయుష్' తరహా రోగ నిరోధక కార్య క్రమాల్లో సైతం పరస్పర సమన్వయం లేదు. కొన్ని సందర్భాల్లో రాష్ట్రాల పాలన మరీ ఘోరంగా కనిపి స్తుంది. కనీస పరిజ్ఞానం లేనివారిని కూడా కీలక పదవుల్లో నియమిస్తుంటారు. ఎన్నో శాఖల్లో అధికారుల పదవీకాలం ఆరు నెలలు మహా అంటే ఏడాదికి మించడం లేదు. ఇంత పరిమితకాలంలో బాధ్యతలను అర్థం చేసుకొని సమర్థంగా నిర్వహించడం కష్టసాధ్యం. అందువల్లే చాలా ప్రభుత్వ శాఖల్లో బాధ్యతరాహిత్యం రాజ్య మేలుతోంది. ఫిర్యాదుల సంస్కృతి పెరిగిపోయింది. ప్రతి ఒక్కరూ మరొకరిపై ఆరోపణలు చేయడానికే సమ యాన్నంతా ఖర్చు చేస్తున్నారుగానీ, పని పట్ల నిబద్ధత కనబరచడం లేదు. తప్పులను కప్పిపుచ్చుకోవడం కోసం ఏవో కుంటి సాకులు చూపడం అలవాటుగా మారింది. ఈ పరిస్థితుల్లో అవినీతి అడ్డూ ఆపూలేకుండా విస్తరిం చడం ఆశ్చర్యం కలిగించదు. ప్రజలకు అందించాల్సిన సేవల విషయంలో ప్రభుత్వం తరచూ చేతులెత్తేస్తోంది. ఇందుకు సంబంధించి విద్య, ఆరోగ్యం ప్రధాన వైఫల్యాలు. గతంలో జరిగిన తప్పులను అంగీకరించడం ఆహ్వా నించదగిన మార్పు. విధాన రూపకర్తల స్థాయిలో ఈ తరహా మార్పు కనిపిస్తోంది. నిర్లక్ష్యానికి గురైన రంగా లపై విధానకర్తలు ప్రత్యేక దృష్టి పెడుతున్నారు. వీటికోసం అదనంగా నిధులనూ కేటాయిస్తున్నారు. నాణ్య మైన సేవలను అందజేసే విషయంలో సంస్కరణలు రానంత కాలం- ఎన్ని అదనపు నిధులను కేటాయించినా అవి అక్రమార్కుల పాలవుతాయన్నది గుర్తించాలి. వ్యవస్థలో ఒకరకంగా ఇది అసంతృప్తి ప్రబలడానికి కారణ మవుతుంది.

ఇలాంటి దుర్భర పరిస్థితుల్లోనే మనం బతకాలా? ఈ గడ్డుస్థితినుంచి బయటపడలేమా? మన పాలన సామర్థ్యం పెరగదా? నాసిరకం పాలన ధాటికి ఆర్థిక వ్యవస్థ కకావికలు కావలసిందేనా? ఆధునిక అవసరా లకు అనుగుణంగా సేవల రంగాన్ని ముమ్ముందు మనం ఎలా తీర్చిదిద్దబోతున్నామన్న దానిపైనే ఈ ప్రశ్న లకు జవాబులు ఆధారపడి ఉంటాయి. నూతన తేజంతో దేశ ఆర్థిక వ్యవస్థ కొత్త చిగురులు తొడగాలంటే, పేదరికాన్ని పారదోలాలంటే ప్రజా ధనాన్ని సక్రమంగా ఉపయోగించడం తప్పనిసరి. సేవల విషయంలో మరింత మెరుగైన పనితీరు కనబరచడమూ కీలకమే. ప్రజా జీవనంలో నాణ్యతను తీసుకురావాలంటే, అవినీ తిని అంతమొందించాలంటే సమగ్ర రాజకీయ సంస్కరణలు తప్పనిసరి. అభివృద్ధిని లక్ష్యంగా చేసుకొని- హేతుబద్ధమైన, ఉద్యోగాల కల్పనకు దోహదంచేసే విధానాలను రూపొందించడం నేడు తక్షణావసరం. తిరోగ మన విధానాలను వీలైనంత త్వరగా వదలించుకోవాలి. రాజకీయ, విధాన రూపకల్పనల్లో వైఫల్యాలను చక్కది ద్దుకునేంతవరకూ- దేశ ఆర్థిక వ్యవస్థ ఎక్కడున్నది అక్కడే ఉండిపోనవసరం లేదు. చుట్టూ ఉన్న రాజకీయ పరిమితుల్లోనే సమర్థమైన పనితీరును కనబరచవచ్చు. అభివృద్ధిని వేగిరపరచి పేదరికం భారాన్ని తగ్గించ వచ్చు. అందుకోసం సేవల నిర్వహణలో ముందడుగేయాలి.

### *బాధ్యత తెలిసిన వ్యవస్థ కావాలి*

నాలుగు రకాల పద్ధతుల్లో సేవల నిర్వహణను మెరుగుపరచవచ్చు. మొదటిది: కేంద్ర, రాష్ట్ర, స్థానిక స్థాయుల్లోని అన్ని రంగాలను, సేవలను ఒకదానితో మరొకదాన్ని అనుసంధానించాలి. పాలన వ్యవస్థలోని భిన్న స్థాయులను భారీయెత్తున పునర్వ్యవస్థీకరించడం తప్పనిసరి. వివిధ శాఖల మధ్య మెరుగైన సమ

న్వయం ద్వారానే విధాన రచనలోనూ, కార్యాచరణలోనూ మెరుగైన ఫలితాలను సాధించవచ్చు. రెండోది: పాలనలోని అన్ని స్థాయుల్లో సిబ్బంది నిర్వహణకు సంబంధించి సహేతుకమైన విధానాలకు రూపుదిద్దాలి. సంబంధిత పరిజ్ఞానం ఉన్నవారిని, ఉద్యోగ బాధ్యతలకు సరిపోయే అర్హతలున్న వ్యక్తులను మాత్రమే ఎంపిక చేయడం, నిర్ణీత కాలానికిగాను ఉద్యోగ భద్రత కల్పించడం, లక్ష్యాల్లో స్పష్టత వంటివి సిబ్బంది నిర్వహణలోని కీలకాంశాలు. ఉద్యోగ నిర్వహణలో రాజకీయ ఒత్తిళ్లు, వ్యక్తిగత రాగద్వేషాలు తదితరాల పాత్రను తోసిపుచ్చలేం. సమర్థమైన సిబ్బంది నిర్వహణ ద్వారా ఈ పరిమితులను అధిగమించవచ్చు. మంచి పనితీరును రాబట్టుకోవచ్చు. పోటీకి తట్టుకునేలా ఉద్యోగులను తీర్చిదిద్దడం, మారుతున్న అవసరాలకు అనుగుణంగా శక్తిసామర్థ్యాలు పెంచుకోలేనివారికి మర్యాద పూర్వకంగానే వీడ్కోలు పలకడం వంటివి సిబ్బంది నిర్వహణలోని ప్రధాన అంశాలు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల మధ్య ఎన్నెన్నో అడ్డుగోడలు ఉన్నాయి. ఈఅవరోధాలను తొలగించి వాటి మధ్య సమన్వయాన్ని పెంచాల్సిన అవసరం ఉంది. మూడోది: అధికారంతోపాటు బాధ్యతకూడా మిళితమైన వ్యవస్థ ఇప్పుడు మనకు కావాలి. చేస్తున్న ఉద్యోగానికి, నేర్చుకున్న అంశాలకు మధ్య బొత్తిగా పొంతన లేకపోవడంవల్లే పరిపాలన గాడితప్పుతోంది. ఒకరిమీద మరొకరికి అపనమ్మకం, విపరీతమైన కేంద్రీకరణ, లెక్కకు మించిన సంక్లిష్ట నియమ నిబంధనలు, చొరవ తీసుకునే తత్వం కొరవడటం వంటివి ప్రభుత్వ ఉద్యోగుల పనితీరును దెబ్బతీస్తున్న లక్షణాలు. వీటి కారణంగానే చాలా ప్రభుత్వ శాఖల్లో పనితీరు నత్తనడకను తలపిస్తుంటుంది. ఫైళ్లు, సమావేశాలతోనే ఉద్యోగుల సమయం 90 శాతం తెల్లారిపోతోంది. సృజనాత్మకంగా కచ్చితమైన ఫలితాలకోసం శ్రమించే పరిస్థితి కనిపించడం లేదు. బాధ్యత తెలిసిన వ్యవస్థను తయారు చేసుకోవలసిన అవసరం నేడు మనమీద ఉంది. ఆమేరకు ప్రభుత్వంలోని పలు విభాగాల ప్రతినిధులకు సిసలైన అధికారాన్ని, వనరులను సమకూర్చాలి.

చివరగా- ఎంత ఖర్చు పెడుతున్నాం నుంచి ఎలాంటి ఫలితాలు రాబడుతున్నాం వైపుగా మన దృక్పథాన్ని మార్చుకోవాల్సి ఉంది. ముఖ్యంగా మౌలిక సౌకర్యాల రంగంలో నిర్దేశిత లక్ష్యాలను చేరుకుంటున్నామా లేదా అన్న విషయాన్ని క్షుణ్నంగా పరిశీలించాలి. సేవలరంగంలో ఫలితాలను ఎప్పటికప్పుడు అంచనా వేయాలి. విద్యావ్యవస్థ పనితీరు, ఆరోగ్య రంగం తీరుతెన్నులు, వృత్తి నైపుణ్యాలు, రోగాల వ్యాప్తి వల్ల కలుగుతున్న ఆర్థికభారం తదితరాలను వీలైనంత కచ్చితత్వంతో అంచనాకట్టడం అసాధ్యమేమీ కాదు. ఎంపిక చేసిన ప్రాంతాల్లో నిర్వహించే సర్వేల ద్వారా జిల్లా, బ్లాకు స్థాయుల్లో ప్రభుత్వ సేవల నాణ్యతను తెలుసుకోవచ్చు. మంచి నైపుణ్యాలున్న ఎన్.ఎస్.ఎస్.ఒ. వంటి సంస్థలను అందుకోసం ఉపయోగించవచ్చు. సర్వేలు చేసి ఇలాంటి సంస్థలు వెల్లడించే సమాచారం ద్వారా అవసరానుగుణంగా విధానాలను, వ్యూహాలను పునఃసమీక్షించుకొనే అవకాశం దొరుకుతుంది. ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలు, కీలక రంగాల పనితీరును స్థానిక స్థాయులనుంచి అంచనావేసేందుకుగాను ఈ తరహా సంస్థలను పరిపుష్టం చేయాల్సి ఉంది. విద్య, ఆరోగ్యం, సామాజిక భద్రత వంటి కీలక రంగాలకు కేటాయించాలనుకుంటున్న నిధులతో పోలిస్తే- ఇందుకోసం అయ్యే అదనపు ఖర్చు చాలా తక్కువ. ప్రభుత్వాలు వెంటనే మేల్కొని ఆ దిశగా చొరవ చూపాలి.

(రచయిత లోక్‌సత్తా, 'ఓట్ ఇండియా'ల సమన్వయకర్త)